ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు సస్పెన్షన్

- ఒంగోలులో ఇద్దరు
- వైపాలెంలో ఒకరు
- భూ కుంభకోణాల్లో

పాలు పంచుకున్నందుకే

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

నకిలీ స్టాంపులతో భూముల రిజిస్ట్రేషన్లలో పాత్ర ఉన్న ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లను ఆశాఖ ఐజీ గురువారం సస్పన్షన్ చేశారు. ఒంగోలు-1 సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రమణ కుమార్,ఒంగోలు-2 సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ, యర్రగొండ పాలెం సబ్‌రిజిస్ట్రార్ పనిచేస్తున్న జ్ఞానసుందరం సస్పన్షన్‌కు గురయ్యారు. ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్లు 54 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లలో నకిలీపత్రాలు పెట్టినా పరిశీలించకుండా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఒంగోలులో జరిగిన అనేక తప్పిదాల్లో ఈ శాఖ కార్యాలయమే కీలకపాత్ర పోషించింది. ఇక్కడ నుంచే అన్ని వ్యవహారాలు నడిచాయి. నకిలీ డాక్యుమెంట్లు పెట్టి కొందరు దళారులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. నిజమైన యజమానులకు కంటిమీద కునుకులేకుండా చేశారు. భూకుంభ కోణాలతో ఒంగోలు వణికి పోయింది.దీనిపై సిట్ ఏర్పాటు కాగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అరెస్టులు జరిగాయి. ఇంకా 200 మంది పరారీలో ఉన్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సంచలన ప్రకటన చేశారు. రాజకీయంగానూ పార్టీలు, నేతల మధ్యఆరోపణలు, దుమారాలు రేగాయి. ఒంగోలు రాష్ట్రంలోనే భూకుంభ కోణాలపై చర్చలో నిలిచింది. దీనంతటికీ కారణం పరిశీలన చేయకుండా రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పిదాలే. అందరూ కలిసి భూకుంభకోణాలకు తెరలేపారు. ఎట్టకేలకు వీరిపై వేటు పడింది.

శ్మశాన వాటికకు దారేదీ?

- అంత్యక్రియలకు అవస్థలు
- ప్రభుత్వాలు మారినా తీరని సమస్య
- జరుగుమల్లి అరుంధతి కాలనీ వాసుల ఇక్కట్లు

▲ 3లో

వర్షంతో ఊరట

- జీవం పోసుకున్న పంటలు
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షం లేకపోయినా ముసురు పట్టింది. జల్లులు పడుతున్నాయి. గురువారం ఉదయం నమోదైన వర్షపాత గణాంకాలను పరిశీలిస్తే కనిగిరి డివిజన్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కొండపి, కనిగిరి దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొంత మేరకు ఆశాజనకంగానే ఉంది. ఈ వర్షాలకు ఈ పాటికే సాగుచేసిన పంటలకు మేలు కలుగుతోంది. ఎండిపోతున్న పంటలకు వర్షం ఊపిరిపోసింది. పత్తి, పొగాకు, మిర్చి తోటలకు బాగా ఉపయోగం పడుతుంది. అయితే రైతులు ఆశించిన స్థాయిలో వర్షం ఇంకా కురవలేదు. ఖరీఫ్ నుంచి కరువు కొనసాగుతోంది. రబీని వెంటాడుతోంది. సాగు చేసిన పంటలు ఎండిపోతుండగా.. రబీలోనూ సాగు ముందుకు సాగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను గుర్తించ లేదు. ఇప్పటికీ వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు సాగర్ కాలువల్లో నీరు లేనందున ఆరుతడి పంటలకు సమస్యగా మారింది. ఎక్కడా నీరు లేకపోవడంతో తీవ్ర కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం పుడితే తప్ప ఈ సమయంలో వర్షాలు సహజంగా కురిసే పరిస్థితి లేదు. గురువారం ఉదయం నమోదైన వర్షపాత వివరాలను పరిశీలిస్తే జిల్లా సగటు 14.3 మిల్లీమీటర్లగా నమోదైంది. మర్రిపూడిలో అత్యధికగా 44.8 మిల్లీమీటర్లు నమోదు కాగా పుల్లలచెరువు మండలంలో అసలు వర్షం కురవలేదు. గిద్దలూరు నియోజక వర్గంలోని మండలాల్లో వర్షపాతం స్వల్పంగా నమోదైంది. హను మంతుని పాడులో 40 మిల్లీమీటర్లు, శింగరాయ కొండలో 37.2 , కొత్తపట్నంలో 36.4, పొదిలిలో 29.6, వెలిగండ్లలో 26.2, కొండపిలో 25.6, జరుగుమల్లిలో 23.8, పామూరులో 20.2, టంగుటూరులో 20, సంతనూతలపాడులో 18.6, పొన్నలూరులో 18, ఒంగోలులో 17.8, చీమకుర్తిలో 16, ముండ్లమూరులో 15.2, పిసిపల్లిలో13.4, రాచర్లలో 13.2, వైపాలెంలో 13, కనిగిరిలో 12.6, బేస్తవారిపేటలో 10.2, కురిచేడులో 10, దర్శిలో 8.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఈపాటికే సాగు చేసిన పంటలు జీవం పోసుకున్నాయి. భూములు పదును కావడంతో రైతులు పంటల సాగు సిద్ధ:మవుతున్నారు.

పొదిలిలో రహదారిపై కి చేరిన వర్షపు నీరు

'వరి' సాగేనా..?

- అనుకూలించని ప్రకృతి
- తగ్గిన పంటల సాగు
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడలేదు. దీంతో జిల్లాలో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్‌లో 1,09,169 హెక్టార్లకు గాను 86,374 హెక్టార్లలో మాత్రమే వరి సాగు చేశారు. రబీలో 20,575 హెక్టార్లకు గాను 4,668 హెక్టార్లలో సాగు చేశారు. రబీలో వరి సాగయ్యే అవకాశాలు లేవని రైతులు చెబుతున్నారు.

ఖరీఫ్ ప్రారంభంలో జలవనరుల శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి పంట సాగు కోసం వార్షిక ప్రణాళిక ను రూపొందించి 67 టిఎంసిల నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు.సాగర్ కుడి కాలువకు కూడా నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. జూన్‌లో మూడు పంటలు సాగు చేసుకోమని చెప్పి పంట కాలువలకు మంత్రి నీటిని విడుదల చేశారు. వర్షాలు సక్రమంగా పడతాయని సాగునీటికి ఇబ్బంది ఉండదని చెప్పారు. దీంతో రైతులు మాగాణి సాగుకు సన్నద్ధమయ్యారు. జూన్‌లో విడుదల చేసిన నీటితో మంచినీటి అవసరాలు తీరాయి. పంటల పంటల సాగుకు నీరు అందలేదు. వరి పైర్లకు బాగా నీటి అవసరం ఉన్న జూలై, ఆగస్టులో వర్షాలు పడలేదు. దీంతో మాగాణి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పొలాలకు నీరు పెట్టేందుకు రైతులే సొంత ఖర్చులతో పంట కాలువలను బాగుచేసుకున్నారు.

జిల్లాలోని వేమూరు, రేపల్లే, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని రైతులు కృష్ణాకాలువ, కొమ్మమూరు కాలువ కింద వరి సాగు చేస్తారు. చీరాల, పర్చూరు నియోజక వర్గాల్లో కొమ్మమూరు కాలువ కింద సాగు చేస్తారు. అద్దంకి నియోజకవర్గంలో సాగర్ నీటితో సాగు చేస్తారు. పంటల సాగు కోసం సాగర్ కాలువకు నీటిని విడుదల చేయలేదు. దీంతో వరి సాగు సాధ్యపడలేదు. బాపట్లలో కొంత ప్రాంతం, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో పంట కాలువకు నీరు రాలేదు. దీంతో వరిసాగు నిలచిపోయింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 1,09,169 హెక్టార్లకు గానూ 86,374 హెక్టార్లల్లోనే సాగు చేశారు. ఖరీఫ్‌లో గతంతో పోలిస్తే 22,795 హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం తగ్గింది. అక్టోబరు నుంచి రబీ సీజన్ ప్రారంభంలో చీరాల,పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లోనే ఎక్కువగా వరి సాగు చేయాల్సిఉంది. పంట కాలువల్లో నీరు లేక వస్తాయన్న నమ్మకం కూడా లేక రైతులు వరి సాగుకు ముందుకు రాలేదు. దీంతో రబీలో 20,575 హెక్టార్లకు గాను 4,668 హెక్టార్లలోనే వరి సాగు ▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

భూకుంభకోణాలపై

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- బాధితులకు న్యాయం చేయాలి
- 27న కలెక్టరేట్ వద్ద ధర్నా
- సిపిఎం రౌండ్ టేబుల్

సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరం, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నకిలీ స్టాంపులు, భూ కుంబ కోణాలపై సిట్‌తో కాకుండా సిట్టింగ్‌జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని పలువురు వక్తలు కోరారు.'నగరంలో నకిలీ స్టాంపులు..భూ కుంభకోణాలు' అనే అంశంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు వక్తలు, భూబాధితులు మాట్లాడుతూ నకిలీ స్టాంపులు, భూ కుంభకోణాలపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూ ఆక్రమణలపై ఈనెల 27న ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించాలని, అనం తరం జిల్లా కలెక్టర్‌ను కలిసి భూ ఆక్రమ ణలపై వినతి పత్రాలు సమర్పించాలని తీర్మానించారు. భూ బాధి తులంతా అర్జీలు తీసుకొని ధర్నాకు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిట్ ద్వారా విచారణ జరిగితే అధికార పార్టీ ప్రభావం సిట్‌పై ▶ 2లో

'వరి' సాగేనా..?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. నవంబరు నెలాఖరు తర్వాత వరి సాగు చేసే పరిస్థితి ఉండదు. దీంతో రబీలో దాదాపు 15,700 హెక్టార్లలో వరి సాగు నిలిచి పోయింది. ఖరీఫ్, రబీ సీజన్లలో 38,500 హెక్టార్లలో వరిసాగు నిలిచి పోయింది. రబీలో కారంచేడు మండలంలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 864 హెక్టార్లు పెరిగింది. ఖరీఫ్‌లో 6,775 హెక్టార్లల్లో వరిసాగు చేయాల్సింది. కేవలం 2,907 హెక్టార్లలో సాగు చేశారు. కారంచేడు మండలంలో రెండు సీజన్లలో కలిపి మూడు హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్‌లో అన్ని పంటల సాగు విస్తీర్ణం 1,53,136 హెక్టార్లు కాగా 1,07,877 హెక్టార్లల్లో సాగు చేశారు. ఖరీఫ్‌లో 45,259 హెక్టార్లలో పంటల సాగు తగ్గింది. రబీలో పంటలసాగు విస్తీర్ణం 1,56,607 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 14 వేల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం అడపా దడపా కురుస్తున్న వర్షాలకు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటల సాగుకు సన్నద్ధమవుతారని అధికారులు చెబుతున్నారు. ప్రకృతి అనుకూలించని కారణంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఈ ఏడాది పంటల సాగు తగ్గింది.

రబీలో వరి సాగు ఇలా..(హెక్టార్లలో)

మండలం	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుత సాగు
బల్లికురవ	2626	108
బాపట్ల	1,015	162
చినగంజాం	3,892	968
చీరాల	4,352	264
కారంచేడు	1,726	2,590
మార్టూరు	904	94
పర్చూరు	570	190
సంతమాగులూరు	2,622	87
వేటపాలెం	880	25

భూ కుంభోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ప్రభావం సిట్‌పై ఉంటుందన్నారు. అందుకనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ భూ కుంభకోణాలపై అర్జీలు ఇచ్చినా సిట్ సమస్యలను పరిష్కరించడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదన్నారు. భూ కుంభకోణాల వెనుక ఉన్న రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ గతంలో డొంకలు, వాగు పోరంబోకుల వరకే భూ ఆక్రమణలు ఉండేవన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ అండతో రిజిస్ట్రేషన్ స్థలాలు ఆక్రమించుకొని, నకిలీ పట్టాలు సృష్టించి కోర్టులకు వెళ్లడం, బెదిరించి రాజీలు చేసుకోవడం జరుగుతోందన్నారు. భూ ఆక్రమణల్లో భూములు కోల్పోయిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించాలని, అందుకోసం ప్రజా దర్బార్ నిర్వహించాలని, భూములు కోల్పోయిన వారిని విచారించి , పత్రాలు సమగ్రంగా పరిశీలించి హక్కుదారులకు వారి భూమిని వారికి అప్పగించాలని, ఈ భూముల కుంభకోణం వెనుక ఉన్న అసలు దోషులను పట్టుకొని శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజీవ్ నగర్ కాలనీ డిప్యూటీ మేయర్ బాధితులు, వైసిపి నాయకురాలు పి ప్రభావతి బాధితులు, మామిడిపాలెం చెరువు వద్ద రిజిస్ట్రేషన్ ప్లాట్లకు దారిలేక పోరాడుతున్న బాధితులు, మంగమ్మ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి పుల్లారావు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైసిపి రెబల్ నాయకుడు సుబ్బారావు గుప్తా, సిపిఎం నగర నాయకులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, టి మహేష్, అత్తింటి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

తెలుగు కవుల చిత్రపటాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని మర్రిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు కవుల చిత్రపటాలను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపు కోసం శ్రమించాలి

టీడీపీ గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి కార్యకర్తా శ్రమించాలని టీడీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. నా బూత్-నా బాధ్యత కార్యక్రమంలో భాగంగా రాచర్ల పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్‌ఛార్జులు, టీడీపీ, జనసేన ముఖ్య నాయకుల సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అశ్రద్ధ వహించకుండా బూత్ ఇన్‌ఛార్జులు, టీడీపీ, జనసేన నాయకులు సమిష్టిగా పని చేయాలని కోరారు. ప్రతి బూత్‌లో మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని, డబుల్ ఓటర్లను, డెత్ ఓటర్లను గుర్తించి, దొంగ ఓట్లకు అవకాశం లేకుండా చూడాలని కోరారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతీ బూత్‌లో టీడీపీ, జనసేన ఓటు బ్యాంకును బలోపేతం చేసుకొని ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను మన వైపు మరల్చుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేనల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాచర్ల పంచాయతీకి చెందిన బూత్ ఇన్‌ఛార్జులు, టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

భైరవకోనలో వైసిపి నాయకుల పూజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని వైసిపి ముఖ్య నాయకులు గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో పూజలు చేశారు. వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసిపి ముఖ్య నాయకులు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, పాలుగుళ్ల రత్నారెడ్డి, గూడపురెడ్డి రమణారెడ్డి, బసిరెడ్డి జయరామిరెడ్డి, గడ్డం రంగారెడ్డి, సన్నపురెడ్డి శివారెడ్డి, గంట రమణారెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గానుగపెంట మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి రాము తదితరులు గురువారం భైరవకోనను సందర్శించి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్రిముఖ దుర్గాదేవి, బగ్గులేశ్వర, నాగరేశ్వర, కాలభైరవ ఆలయాలలో పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమగ్ర ఓటరు జాబితాపై బిఎల్‌ఓలకు అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సమగ్ర ఓటర్ల జాబితాపై బూత్ లెవల్ అధికారులకు గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు కె రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా సమగ్ర ఓటరు జాబితా రూపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే బూత్ లెవల్ అధికారులు ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు విజయ కుమార్, ఎన్నికల సిబ్బంది, బిఎల్వోలు పాల్గొన్నారు.

శింగరాయకొండలో వర్షం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. 37.2 మిల్లీమీటర్ల వర్షం నమోదయినట్లు అధికారులు చెప్పారు. బుధవారం నుంచి మొదలైన వర్షం గురువారం రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి, సోమరాజుపల్లి, పాత శింగరాయకొండ, శానంపూడి, కనుమళ్ల, కలికివాయి గ్రామాల్లోని రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పొదిలి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పొదిలిలో మురుగు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులపై మురుగునీరు చేరడంతో రాకపోకలకు పాదచారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

తిమ్మాపురంలో 'భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యతుకు గార్యెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని తెలిపారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి వీరారెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, నాగేంద్రబాబు, కాశయ్య, చంటి, రవి, బాబు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పశుఆరోగ్య సంరక్షణ కార్డులను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ (జిల్లా స్పెషల్ ఆఫీసరు) వెంకట్రావు తెలిపారు. నాగులుప్పలపాడు పశువైద్యశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం పశుపోషకులకు పశుఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేశారు. పశు సంవర్ధక శాఖ జేడీఏ బేబీరాణి, ఒంగోలు ఉపసంచాలకులు రమేష్‌బాబు, నాగులుప్పలపాడు పశువైద్యశాల సహాయ సంచాలకులు నాగభూషణం పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం అటవీ శాఖ కార్యాలయం పరిధిలోని పెద్దకొలుకుల గ్రామంలో గురువారం ఆవులు, గేదెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి ఏవి నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా పశువులను నుంచి అటవీ వన్యప్రాణులకు వ్యాధులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఆర్ పశు వైద్యాధికారి జుబేదార్, ఎఫ్ఎస్‌వో వెంకటేశ్వర్లు, డిఆర్వోలు రాంమోహన్‌రావు, ఖాజామొహిద్దీన్, ఎఫ్‌బిలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాసరి చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-దర్శి

దర్శనాపురి నాటక కళాపరిషత్ న్యాయనిర్ణేతగా, వ్యాఖ్యాతగా వ్యవహరించిన కీర్తిశేషులు దాసరి చంద్రశేఖర్ సేవలు మరువలేనివని దర్శనాపురి నాటక కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు కలవకొలను అనంత్ అన్నారు. గురువారం దాసరి చంద్రశేఖర్ సంస్మరణ సభ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాటక కళా పరిషత్ నాయకులు జి ప్రసాద్‌రెడ్డి, కే జైహింద్‌రెడ్డి, షేక్ కాశింవలి తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన జడ్‌పిటిసి

ప్రజాశక్తి-పిసిపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని పిసిపల్లి జడ్‌పిటిసి లక్ష్మీకాంతం ఓకే రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పిసిపల్లి మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి పిసిపల్లి మండలాన్ని వెలిగొండ పరిధిలో చేర్చేందుకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఓకే రెడ్డి తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ద్వారా వారు సిఎంను కలిశారు.

దావా సమను (ఆర్డర్ 5 రూల్ 1మరియు 5)
మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 26/2016
ఎస్‌టి.మహబూబ్ పీరాన్ Died his LRs
ముల్లా మెహరున్నీషా బేగం మరియు ఇతరులు ...... ప్లైంటిఫ్స్
వర్సెస్
ఎస్‌టి.రహిమాన్ మరియు ఇతరులు ... డిఫెండెంట్స్
2వ డిఫెండెంట్
ఎస్‌టి.చాంద్‌బాష, తండ్రి: లేట్ ఎస్‌టి రహిమాన్ ముస్లిం, నివాసం: ఇంటి నెం: 6/2, మెయిన్ రోడ్డు, రాచర్ల గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు దావాలోని వాదులు, దావా ప్లైయింట్ షెడ్యూలు ఆస్తులు భాగపంపకాల కొరకు పరిహారం కొరకు పై నెంబరు దావాను మీ పైన దాఖలు చేసి యున్నందున, ఇందు విషయమై నీకు దావా సమన్లు పంపగా అవి ముట్టని కారణము చేత ఇందు మూలముగా నీకు తెలియజేయునది ఏమనగా 28-12-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయముగా లేదా అడ్వకేట్ ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకోవలెను. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 28-12-2023
వి.శ్రీనివాసరావు
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ ఫ్యామిలీ కోర్టు మరియు ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో,ఒంగోలు
OS No:147/2015
కోళ్లమూడి సంజీవరెడ్డి ....వాది
వర్సెస్
సానికొమ్ము వెంగళరెడ్డి .... ప్రతివాది
To
D14)సానికొమ్ము శ్రీకాంత్ రెడ్డి
D17)ఏలూరు సుబ్బులు
D18)సాని కొమ్ము వెంకటేశ్వర రెడ్డి
D21) గొంట్లరామిశెట్టి
D22)గొంట్ల సుబ్బారావు
D26) కత్తి సురేష్
D27) కత్తి నయం
D28) కత్తి రూత్
పై వారందరి నివాసం పెదగొల్లపల్లిగ్రామం హనుమంతునిపాడు మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబర్ గల దావాలో వాది (పిటిషనరు)ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయు చున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ఆర్డర్ వేసి ఉన్నారు తేది:30.11.2023న ఉదయం 10:30 కి మీరు స్వయంగా గాని లేదా మీ తరుపున వకీలు ద్వారా గాని పై కోర్టువారిఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలపగలరు లేనిచో మీ పరోక్షమున తీర్మానించ బడును.
// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
వాయిదా తేది : 30.11.2023 ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు

ప్రజాశక్తి
3
శుక్రవారం 24 నవంబరు 2023

శ్మశాన వాటికకు దారేదీ?

- చివరి మజిలీలోనూ కష్టాలే
- ప్రభుత్వాలు మారినా తీరని సమస్య
- జరుగుమల్లి కాలనీవాసులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆ గ్రామంలో చనిపోతే వారి మృతదేహాన్ని పూడ్చేందుకు పడే కష్టాలు వర్ణనాతీతం. శ్మశాన వాటిక ఉన్నప్పటికీ అక్కడి వెళ్లేందుకు దారి లేదు. శ్మశాన వాటికకు దారిచూపాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ప్రభుత్వాలు మారిన తమ కష్టాలు తీరడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. జరుగుమల్లి అరుంధతినగర్‌లో 350 కుటుంబాల వారు నివసిస్తున్నారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, వరదలు, ఎండలోనూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎవరైనా చనిపోయారన్న బాధ కంటే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు పడే కష్టం అంతా ఇంతా కాదని చెబుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ కష్టాలు తీరడం లేదని విలపిస్తున్నారు. కాలనీ అభివృద్ధి గురించి పక్కన పెడితే చివరికి శ్మశానవాటికకు వెళ్లే దారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద తమ గోడు వెలిబుచ్చుతున్నారు. కాలనీలో ఎవరైనా చనిపోతే మృత దేహాన్ని తీసుకెళ్లేందుకు మాగాణి గట్టు మీద తీసుకెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఒకరు చనిపోతే వర్షం నీటిలో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అవసస్థలు పడినట్లు కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికకు దారి చూపాలని వారు కోరుతున్నారు.

కాలువలో నుంచి మృతదేహాన్ని తీసుకువెళుతున్న జనం

శ్మశానానికి దారి చూపండి సారు!.. గ్రామస్తుల వేడుకోలు

అంగన్‌వాడీల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8వ తేదీ నుంచి నిరవధికంగా జరిగే సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ యర్రగొండపాలెంలోని సీడీపీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీంకోర్టు 2022 సంవత్సరంలోనే తీర్పు ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయలేదని చెప్పారు. వెంటనే అమలు చేయాలని కోరారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చి మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.5 లక్షలకు పెంచాలని అన్నారు. ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్‌గా ఇవ్వాలని తెలిపారు. హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించి రాజకీయ జోక్యాన్ని అరికట్టి పదోన్నతి వయస్సును 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉండి చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమాను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, బకాయి పడిన సెంటర్ 2017 నుంచి టిఎ బిల్లులు, ఇతర బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రామకుమారి, సుభాషిణి, మల్లేశ్వరి, సుబ్బరత్నాలు, నసీమా, విజయలక్ష్మి, తిరుపాలమ్మ, కోటేశ్వరి, శాంతిబాయి, షంషాద్, రూత్‌మేరి, బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల:

తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 8వ తేదీ నుంచి సమ్మె బాట పడతామని అంగన్‌వాడీలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా రూ.1000 వేతనం ఇవ్వాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇచ్చి వేతనంలో సగం పెన్షనుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని యాప్స్ కలిపి ఒకే యాప్‌గా మార్చాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎస్‌కె ముంతాజ్, వెంకటలక్ష్మి, సుబ్బమ్మ, భాగ్యం, మల్లేశ్వరి, నాగేంద్ర, రాజేశ్వరి, బీబీ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

దోర్నాలలో..

7 వరకూ గ్రామసభలు

ప్రజాశక్తి-దర్శి

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు సచివాలయాల్లో ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు గ్రామసభ ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పట్టికను ఏర్పాటు చేస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే కుసుమకుమారి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ లబ్ధి పొందిన సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డు ఆవిష్కరిస్తారని అన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని అన్నారు. 24వ తేదీన దేవవరం, 28న తూర్పువెంకటాపురం, 29న కొర్లమడుగు, 30న కొత్తపల్లి, వచ్చే నెల 1వ తేదీన లంకోజనపల్లి, 4వ తేదీన పెద్దఉయ్యాలవాడ, 5వ తేదీన పోతవరం, 6వ తేదీన రామచంద్రాపురం, 7వ తేదీన పొతకమూరు గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామాల లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

యుటీఎఫ్ శాఖకు నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

యుటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-దొనకొండ

యూటిఎఫ్ దొనకొండ మండల కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి టి రాజశేఖర్, ఎన్నికల పరిశీలకుడు డి వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఏ ప్రభుదాస్, అధ్యక్షులుగా ఎం వెంకటరెడ్డి, సహ అధ్యక్షులుగా బి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఈ రోశయ్య, కోశాధికారిగా అంజినాయక్, మండల మహిళా కార్యదర్శిగా స్వప్న, మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, మహిళా కమిటీ కన్వీనర్లుగా మరికొందరిని ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులచే ఎన్నికల పరిశీలకుడు వెంకటరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల తమవంతు బాధ్యతగా పనిచేస్తామని నూతన కమిటీ వివరించింది. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, అధికారుల తప్పిదం..

రేషన్ సరుకులకు పేదలు దూరం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రభుత్వం, అధికారుల తప్పిదాల కారణంగా మండలంలోని పలువురు పేదలు నవంబర్ నెల రేషన్ సరుకులు పొందలేకపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రేషన్ కోసం ఒక థంబ్, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే మిగతా సరుకుల కోసం మరో థంబ్ వేయాల్సి రావడం, నెట్ సిగ్నల్ సరిగా లేక సర్వర్ పని చేయకపోవడం, ఎప్పటిలాగా కాకుండా 5 రోజుల ముందుగానే అధికారులు సర్వర్‌ను నిలిపివేయడం తదితర కారణాలతో దాదాపు 120 మంది రేషన్ కార్డుదారులు నవంబర్ నెల రేషన్ సరుకులను తీసుకోలేకపోయారు. మండలంలోని డిజీపేట, బోయమడుగుల పంచాయతీలలోని రేషన్ కార్డుదారులకు ఈ పరిస్థితి ఎదురైంది. డిజి పేట, బోయమడుగుల పంచాయతీలలో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ఎండియు ఆపరేటర్‌గా డిజిపేటకు చెందిన చెవుల మాల్యాద్రిని నియమించారు. ఈ పంచాయతీలలో 1600 రేషన్ కార్డులు ఉన్నాయి. బోయమడుగుల పంచాయతీలోని గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండటంతో నెట్ సిగ్నల్స్ లేక సర్వర్ కూడా సరిగా పనిచేయదు. ఈ పరిస్థితులలో రేషన్ లబ్ధిదారుల నుంచి రెండుసార్లు థంబ్ వేయించాల్సి రావడం సరుకుల పంపిణీకి ఇబ్బందికరంగా మారింది. గత మూడు నెలలుగా 22వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేసేందుకు అవకాశం ఉండేది. అయితే నవంబర్ నెలలో 17వ తేదీనే సర్వర్ నిలిచిపోయింది. దీంతో డిజీ పేటలోని బీసీ కాలనీ, అదే పంచాయతీలోని బొంతవారిపల్లి, బోయమడుగు పంచాయతీలోని వెంకటాయచెరువు ఎస్సీ కాలనీలలో దాదాపు 120 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయలేకపోయారు. దీంతో ఆయా లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చేస్తున్నారు. ఈ విషయంపై తహశీల్దారు షేక్ నాగుల్ మీరాను 'ప్రజాశక్తి' వివరణ కోరగా ఈ విషయంపై ఆర్ఐ కనుక్కుని చెపుతాను అని అన్నారు.

రేషన్ కార్డులు చూపిస్తున్న బాధితులు

కొమ్మాలపాడులో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి-సంతమాగులూరు

గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే ఓ ఇంట్లో 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదును అపహరించారు. ఈ ఘటన మండల పరిధిలోని కొమ్మాలపాడు గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంకాయలపాటి పేరమ్మ కెనరా బ్యాంకులో స్వీపర్‌గా పని చేస్తోంది. రోజులాగే బ్యాంకుకు వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటికి వచ్చింది. ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా ఇనుపపెట్టె పగలగొట్టిఉంది. అందులో బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తికి దేహశుద్ధి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో చెడ్డీ గ్యాంగ్ తిరుగుతోందని, ఏ క్షణంలోనైనా దోపిడీలకు పాల్పడ వచ్చని పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మార్కాపురం పట్టణంలోని తూర్పువీధిలో ఓ ఇంటిలోకి గురువారం ప్రవేశించారు. ఆమె కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారంతా వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వేలిముద్రలు సేకరించారు. ఆ వ్యక్తి మానసిక రోగిగా పోలీసులు గుర్తించి వదిలేశారు.

సైకిళ్ల దొంగకు దేహశుద్ధి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక బీసీ కాలనీలోని శ్రీ గౌతమి జూనియర్ కళాశాల సమీపంలో గురువారం ఒక యువకుడు సైకిల్ దొంగతనం చేస్తుండగా స్థానికులు ఆ దొంగను పట్టుకున్నారు. గత రాత్రి కూడా ఒక సైకిల్ దొంగతనం జరిగిందని బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు తెలిపారు. దొంగిలించిన సైకిల్‌ను తీసుకొచ్చి అమ్మడానికి ప్రయత్నించగా సైకిల్ యజమాని పట్టుకొని దేహశుద్ధి చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు దొంగను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సిఎంగా జగన్ అవసరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివక్ష లేని పాలన, అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని, ఎపికి సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మరికొంత కాలం అవసరమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మార్కాపురం-18 సచివాలయ పరిధిలోని 31, 32వ వార్డులోని లబ్ధిదారులకు సిఎం జగన్ పాలనలో ఇప్పటి వరకు పథకాలు అందుకున్న లబ్ధిదారులకు ఎవరికి ఎంతమేర నగదు సాయం అందిందో వివరిస్తూ సంక్షేమ బోర్డులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి కాలంలో ప్రజలకు ఏమి చేసిందో... ఈ విధంగా బోర్డులు ఏర్పాటు చేయగలరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్, కౌన్సిలర్లు షేక్ చిన్న షేక్షావలి, షేక్ నాసర్‌వలి, జె నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అన్నారు. ఓ ప్రణాళిక ప్రకారం చదువులు కొనసాగిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఏకలవ్య రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ జోబ్, డాక్టర్ ప్రసాద్, కళాశాల చైర్మన్ బట్టు రమణారెడ్డి, దేవయ్య, ప్రిన్సిపల్ బాషా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర ప్రారంభిస్తున్న షేక్ సైదా

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి-దొనకొండ

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైపు వెంకటకృష్ణారెడ్డి సారథ్యంలో దర్శి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి దొనకొండ నుంచి చేపట్టిన పాదయాత్రను కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సైదా మాట్లాడుతూ డిసెంబరు 3న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగిస్తుందన్నారు. దేశంలో నరేంద్రమోడీ దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నాడని అన్నారు. రైతులను, కార్మికులను, శ్రామికులను, నిరుద్యోగ యువతను బిజెపీ మోసగించిందని అన్నారు. అటువంటి బిజెపికి వైసీపీ, టీడీపీ నేతలు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని సమస్యలపై మొదటిసారిగా గళమెత్తి ఏ నాయకుడు చేయని విధంగా 250కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టేలా వెంకట కృష్ణారెడ్డి నిర్ణయం అభినందనీయమన్నారు. వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో వలస నాయకుల పాలన వలన అనేక ప్రజాసమస్యలు పేరుకుపోయాయని అన్నారు. వలస నేతల పాలనకు ప్రజలు స్వస్తి చెప్పేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాళ్లూరు మండలంలోని మొగలిగుండాల రిజర్వాయర్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అధ్వానంగా తయారైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. తదితర సమస్యలపై ఐదు మండలాల్లోని 40 గ్రామాల్లో 15 రోజులు పాటు 250కిలోమీటర్ల పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దొనకొండలో ప్రారంభమైన పాదయాత్ర చిరుజల్లులు కురుస్తున్నా ఉత్సాహంగా యర్రబాలెం మీదుగా కురిచేడు మండలంలోని పొట్లపాడుకు చేరింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం వెంకటేశ్వరరావు, బొడ్డు సతీష్, రమణారెడ్డి, ఇమ్మానుయేలు, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రెహనాబాను పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రజక సంఘం ప్రతినిధులు

26న రజక ఆత్మగౌరవ మహాసభ

ప్రజాశక్తి-కనిగిరి

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఎపి రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాతపాటి అంజిబాబు అధ్యక్షతన ఈ నెల 26న రజకుల ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. అందులో భాగంగా కనిగిరిలోని మాచర్ల వెంగయ్య రజక భవనం వద్ద ఆత్మగౌరవ మహా సభ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాషర్ మ్యాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దేవూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రజకులకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించాలని అన్నారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానించి లోక్‌సభకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం కనిగిరి ప్రాంతీయ అధ్యక్షుడు ఉప్పలపాటి కొండయ్య, బహుజన నాయకుడు చీమలదిన్నె చినవెంగయ్య, కనిగిరి టౌన్ గౌరవ సలహాదారుడు బొప్పరాజు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు శెట్టిపల్లి కొండయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొత్తకోట వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమవరపు శ్రీనివాసరావు, కనిగిరి టౌన్ ప్రధాన కార్యదర్శి పొదిలి తిరుపతయ్య, కనిగిరి మండల ఉపాధ్యక్షుడు వేంపాటి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రాయళ్ల చంగలయ్య, మాచర్ల బాలుడు, పోలిచర్ల శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి బెల్లంకొండ రంగనాయకులు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు కల్లగుంట ప్రసాద్, పులి రాంబాబు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి - చీరాల

రైల్వే రంగం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ భారతీయ రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటిదని అన్నారు. కోట్లాది ప్రజలకు జీవనంలో ఒక భాగం అన్నారు. భారతీయ రైల్వే ప్రపంచంలోనే 4వ స్థానంలో ఉందని తెలిపారు. దేశ ఆర్థిక అభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తు సాధారణ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తుంది రైల్వే రంగాన్ని స్వదేశీ, విదేశీ ప్రైవేటు కార్పొరేటు వ్యక్తులకు మోడీ నైవేద్యంగా ఇవ్వడాన్ని వ్యతిరేకించాలని కోరారు. ప్రజల సొమ్ముతో వేసిన రైల్వే లైను ఎలాంటి అదనపు పెట్టుబడి లేకుండా ప్రైవేటు కంపెనీలు యదేచుగా వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

రైల్వే స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నేతలు

భవిష్యత్తులో రైలు ప్రయాణాలను కూడా ధనవంతుల కోసమనే విధంగా మార్చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు అందుబాటులో ఉన్న చౌకైన రైలు ప్రయాణం కూడా భారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ బాబురావు, నాయకులు ఎల్ జయరాజు, కె ఆంజనేయులు, జి సురేష్, ఐవి ప్రసాద్, చక్రపాణి పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నిజాంపట్నం

కె రాజేష్

సిహెచ్ గణేష్‌రావు

వై శ్రీనివాసరావు

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నికను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు మార్కు యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ హాజరవగా ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య వ్యహరించారు. మండల నూతన అధ్యక్షులుగా కె రాజేష్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ గణేష్‌రావు, గౌరవాధ్యక్షులుగా వై శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా పి లక్ష్మిపార్వతి, అబుల్ మాలిక్, కోశాధికారిగా ఓ నాగరాజు, మహిళా కార్యదర్శిగా వై పాప, సీపీఎస్ మండల కన్వీనర్‌గా బి వెంకటరమణ, కార్యదర్శులుగా ఎండి హుస్సేన్, యు కుమార్, మరకా విజయలక్ష్మి, నరేష్, ఎం లక్ష్మణరావు, సత్యనారాయణ, కె వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్స్‌గా డి హరిబాబు, రామకృష్ణ, కె పార్వతమ్మ, నాగ బసవయ్య, వైపి మాణిక్యరావు, పి ఏడుకొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యా వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గం పోరాటాలు చేయాలని యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ సూచించారు.

మహాత్ముడి విగ్రహానికి స్థానచలనం

ప్రజాశక్తి - బాపట్ల

జిబిసి రోడ్డు విస్తరణలో భాగంగా డివైడర్‌పై ఉన్న జాతీయ నేతల విగ్రహాలకు స్థానచలనం కలుగుతోంది. పట్టణంలోని అంబేద్కర్ బొమ్మకు దగ్గర్లో డివైడర్‌పై ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని అక్కడి నుండి తొలగించి పట్టణంలో మరింత ఆకర్షణీయమైన ప్రాంతంలో ప్రతిష్టిస్తామని ఆర్యవైశ్య సంఘం నాయకులకు ఎంఎల్‌ఎ కోన రఘుపతి హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహాన్ని అక్కడి నుండి తొలగించే ప్రక్రియను చేపట్టారు. అక్కడ నుండి తొలగించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని గడియార స్తంభం, పోస్ట్ ఆఫీస్ భవనం మధ్య ప్రతిష్టించేందుకు ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం

గాంధీ విగ్రహ మార్పుకు శంకుస్థాపన చేస్తున్న రఘుపతి

అధ్యక్షుడు కొత్తమాసు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కోళ్ళపూడి సురేష్, ఉపాధ్యక్షులు బూర్లె అనిల్, మామిడి రమేష్ కుమార్, వెంకట రత్న గుప్త, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, పుల్లయ్య గుప్త, వేణు, మని సాయి కృష్ణ, తడవర్తి నారాయణ, తాళ్లూరి శ్రీను, రాము, భాస్కర ప్రసాద్ పాల్గొన్నారు.

అంజమరాజు అంతిమయాత్ర

ప్రజాశక్తి - పంగులూరు

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ సరికొండ అంజమరాజు అంత్యక్రియలు గురువారం ఉదయం బయట మంజులూరు గ్రామంలో జరిగాయి. సిపిఎం నాయకులు, బంధువులు, స్నేహితులు ఆయనకు తుది వీడ్కోలు పలికారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే బంధువులు బయట మంజులూరులోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, సిపిఎం కొరిశపాడు మండల కార్యదర్శి మొంద్రు ఆంజనేయులు, మండల నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, పాలపర్తి ఏలియా, సరికొండ రామచంద్రరాజు, పూసపాటి సుబ్బరాజు, సరికొండ లక్ష్మణ్ రాజు తదితరులు అంజమరాజు మృతదేహంపై ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. వైసిపి బీసీ సెల్ పంగులూరు మండల కన్వీనర్ చక్రవరం భాస్కర్ రాజు, బట్రాజు కార్పొరేషన్

అంజమరాజుకు అంతిమ యాత్ర

రాష్ట్ర డైరెక్టర్ చక్రవరం జ్యోతి, తదితరులు అంజమరాజు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిమిత్తం మృతదేహాన్ని స్మశాన వాటికకు తరలించారు. దారి పొడవునా సిపిఎం నాయకులు, కార్యకర్తలు కామ్రేడ్ అంజమ రాజు జోహార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

పల్లె నవీన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

డాక్టరేట్ అందుకుంటున్న నవీన్

త్రిపురాంతకంకు చెందిన పల్లె నవీన్‌కు డాక్టరేట్ లభించింది. ప్రధాన మంత్రి పంటల బీమా యోజనపై పరిశోధనలు చేసినందుకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అర్థశాస్త్రంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పరిశోధన డైరెక్టర్ డాక్టర్ ఎ భారతీదేవి పర్యవేక్షణలో నవీన్ పరిశోధనలు నిర్వహించారు. నవీన్ తన పరిశోధనల్లో వెనుకబడిన ప్రకాశం జిల్లాలోని రైతులకు పంటపై ఉన్న బీమా అవగాహనపై వివరించడంతో డాక్టరేట్ దక్కింది.

విద్యార్థులతో ఎంఇఒ మస్తాన్ నాయక్

కాఫీ విత్ వెల్ఫేర్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో కాఫీ విత్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ మీటింగ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ జిఇఆర్ సర్వేలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులను ఎన్‌రోల్‌మెంట్ చేయాన్నారు. వలస వెళ్లిన విద్యార్థుల వివరాలు వెళ్లిన ప్రదేశంలో పాఠశాలకు వెళ్తున్నారా లేదా అని జిఇఆర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కొండలరావు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో వరికూటి, ఆమంచి

ప్రజాశక్తి-దర్శి

ఆశీర్వదిస్తున్న ఆమంచి

జనసేన అధ్యక్షులు, రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ కుమారుని వివాహంలో రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు వరికూటి నాగరాజు పాల్గొన్నారు. గురువారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రూ.లక్ష విరాళం ఇస్తున్న వాసవి విద్యానికేతన్ డైరెక్టర్

చెన్నకేశవ ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానంలో నలుదిక్కులా గోపురాల నిర్మాణాలు జరుగతున్నాయి. రూ.12 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. దేవదాయ శాఖ రూ.2 కోట్లు మంజూరు చేయగా మిగిలిన పైకాన్ని విరాళాల రూపంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఇతర ధర్మకర్తలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా వాసవీ విద్యానికేతన్ డైరెక్టర్ కందేపు రంగయ్య రూ.లక్ష వెయ్యినూటా పదహారు విరాళాన్ని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డికి గురువారం అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన

సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు

ప్రజాశక్తి-కనిగిరి

బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం ద్వారానే హక్కులను కాపాడుకోగలుగుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు అన్నారు. కనిగిరి సుందరయ్య భవన్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు అధ్యక్షతన శ్రామిక మహిళల సమస్యలు, ప్రభుత్వ వైఖరి పరిష్కార మార్గానికై అనే అంశంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో శ్రీనివాసులు మాట్లాడారు. బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంస్కరణల వేగాన్ని పెంచి దేశ సంపదను కారుచవకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని అన్నారు. దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి కీలకమైన బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, పోర్టులు, టెలికాం, విమానాశ్రయాలు, బొగ్గు, రక్షణ, ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు తెగనమ్ముతోందని అన్నారు. వీటిని మనం కాపాడుకోవడానికి కార్మికశక్తిని ఉపయోగించి ముందుకు పోవాలన్నారు. సిఐటియు నాయకుడు ఎం రమేష్ మాట్లాడుతూ కార్మికులకు రక్షణగా ఉన్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా యజమానుల దోపిడీకి తలుపులు బార్లా తెరిచిందని అన్నారు. కార్మిక ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని అధిగమించి ఈ కాలంలో అంగన్‌వాడీ, ఆశ, వీవోఏ, మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆయా, ఆర్పి, వీఆర్ఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ తదితర కార్మికుల సమస్యలపై పోరాడి అనేక విజయాలు సాధించడంలో సిఐటియు కృషి మరువలేనిదని అన్నారు. ఈ కాలంలో మధ్యాహ్న భోజన కార్మికుల నుంచి అంగన్‌వాడీ వరకు రూ.3000 నుంచి రూ.11,500 వరకు మాత్రమే గౌరవ వేతనం లభిస్తోందని, అది చాలక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం సాధించుకోవటానికి శ్రామిక మహిళా శక్తిని కూడగట్టుకొని కార్మికుల హక్కులపై పోరాటం చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ఆస్తి, చెత్త పన్ను, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నదని, ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు పి కల్పన మాట్లాడుతూ కార్మికుల్లో ఎక్కువ శాతం మహిళలు పనిచేస్తున్నారని, వారికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు కే మాల్యాద్రి, రాయల మాలకొండయ్య, స్కీం వర్కర్స్ అంగన్ వాడీలు రాజ్యలక్ష్మి, సీత, పి రజిని, రాయల రమాదేవి, టి అమల, పి నారాయణమ్మ, ఈవీఎన్ వాణి, పోకూరి విజయమ్మ, ఆశ వర్కర్స్ మాధవి, కే ఎస్తేరమ్మ, జై అంకమ్మ, ఆదిలక్ష్మమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు బుర్ర రత్తమ్మ, చల్లగాలి ఎస్తేరమ్మ, బొప్పరాజు రేణుక, పాఠశాల ఆయాలు కొటికల వరలక్ష్మి, చెన్నమ్మ, ఈవోఏ లీడర్స్ రాయల నాగేశ్వరి, రాయల మాధవి, ఎఫ్ఏలు తిరుపతయ్య, కే జీవన్, ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు

సూక్ష్మపోషకాల లోపంతో..

మిరపతోటల్లో ఆకు ముడత తెగులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఉద్యాన అధికారి పి ఆదిరెడ్డి మంగళవారం పుల్లలచెరువులోని మిరప తోటలను గురువారం పరిశీలించారు. రైతులకు సలహాలు ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిరప తోటలలో కొత్తగా వచ్చే ఆకులు ముడతగా వస్తున్నాయని తెలిపారు. కానీ రైతులు బొబ్బర, ముడత, కుచ్చు తెగుళ్లు అని నమ్మి మందులు పిచికారీ చేస్తున్నారని తెలిపారు. వాస్తవానికి ఈ ముడత తామర పురుగు వలన వచ్చేది కాదన్నారు. కేవలం సూక్ష్మపోషకాల వలన ఈ విధంగా వస్తాయని తెలిపారు. వేసిన పొలంలోనే ప్రతి సంవత్సరం మిరప వేయడం, సేంద్రియ ఎరువులు సరిపడా వేయకపోవడం, భాస్వరం ఉండే కాంప్లెక్స్ ఎరువులను విపరీతంగా పైపాటుగా వాడడం వల్ల మొక్కలకు సూక్ష్మపోషకాలైన జింకు, బొరాన్, మెగ్నీషియం, కాల్షియం వంటివి అసలు అందక ఈ విధంగా కుచ్చు వస్తుందని తెలిపారు. నివారణోపాయాలు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో డ్రిప్ సిస్టం ఉన్న రైతులు మల్చింగ్ విధానంలో మిరప మొక్కలు నాటుకుంటే మంచిదని చెప్పారు. అలా నాటిన తోటలు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. మల్చింగ్ వేసినందుకు ఎకరాకు రూ.6400 ప్రభుత్వం రాయితీగా కూడా ఇస్తుందన్నారు. ఉద్యాన పంటలలో రైతులకు సలహాలు, సూచనలకు ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాయి దినేష్‌కు గుండె ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలేనికి చెందిన కడు పేద కుటుంబంలో పుట్టిన పగడాల సాయి దినేష్ అనే బాలుడు గత కొంత కాలం నుంచి గుండె జబ్బుతో బాధ పడుతున్నాడు. వైద్య చికిత్సలు చేయించే స్తోమత లేక సాయి దినేష్ తల్లిదండ్రులు ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్‌కు తన కుమారుడు పడుతున్న ఇబ్బందులు తెలియజేశారు. స్పందించిన ఇస్మాయిల్.. సాయి దినేష్ సమస్యను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూనే దాతల ద్వారా రూ.30 వేలు సేకరించారు. ఆ నగదుతో సాయి దినేష్‌ను విజయవాడలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసేందుకు వైద్యులు ముందుకు వచ్చారు. దీంతో సాయి దినేష్‌కు గుండె ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. యర్రగొండపాలేనికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఐవి సుబ్బారావు తనయుడు డాక్టర్ సందీప్ అదే ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తుండడంతో ఆయన పర్యవేక్షణలో ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ అనంతరం గురువారం ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ బాలుడు సాయి దినేష్‌ను పరామర్శించారు. డాక్టర్ సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ విజయవంతంగా జరగడంతో సాయి దినేష్ తల్లిదండ్రులు ఇస్మాయిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు షేక్ చోటు, షేక్ చాంద్‌బాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

సాయి దినేష్‌ను పరామర్శిస్తున్న ఇస్మాయిల్ తదితరులు

వైసిపి ప్రభుత్వానికి..

కౌంట్ డౌన్ మొదలైంది: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 18వ వార్డులో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ వార్డులోని ప్రజలతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు వస్తే ఏ కుటుంబానికి ఎంతమేర ప్రయోజనం కలుగుతుందో వివరించారు. వైసిపి పాలనలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై భారాలు మోపారన్నారు. విద్యుత్ చార్జీలు ప్రజలకు మరింత భారంగా మారాయన్నారు. నిత్యావసరాలు కొనలేనట్లుగా జనం ఉన్నారన్నారు. అన్ని ధరలు పెంచిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. అక్రమంగా తమ నాయకుడు చంద్రబాబును అరెస్ట్ చేయడంతో ప్రజలు రగిలిపోతున్నారన్నారు. ఏ తప్పు చేయలేదు కనుకనే చంద్రబాబు కొద్ది రోజుల్లోనే బయటకు వచ్చారని తెలిపారు. టిడిపికి చెందిన కొందరు నాయకులను వైసిపి నేతలు ఇప్పటి నుంచే బెదిరిస్తున్నారని, ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కొప్పుల సంధ్యారాణి నాయకత్వం వహించగా టిడిపి పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు పిన్నిక శివ, ఉపాధ్యక్షులు డి నాసరయ్య, టిడిపి నాయకులు మట్టం వెంకటేశ్వర్లు, కొప్పుల వెంకటేశ్వర్లు, పుప్పాల దేవానంద్, పఠాన్ గులాబ్‌ఖాన్, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ చిలకపాటి చిన్న వెంకటచెన్నయ్య పాల్గొన్నారు.

దర్శి: టీడీపీ 2024 ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని, అందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ పథకాన్ని విజయవంతం చేయాలని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం దర్శి పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచకాలు కొనసాగుతున్నాయని, టీడీపీ వస్తేనే అందరికీ సమన్యాయం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఏ తప్పు చేయకపోయినా 52 రోజులు జైల్లో పెట్టారని అన్నారు. భవిష్యత్తులో బాబు మళ్లీ అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. దర్శి పట్టణంలోని 20 వార్డులకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ స్టీవెన్, తలారి కోటయ్య, తెలుగు యువత అధ్యక్షులు చిన్నా, మహిళా నాయకురాలు శోభారాణి, సంగా తిరుపతిరావు, శ్రీను, సుబ్బారావు, అనిల్, దినకర్, రామగిరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

కార్తీక వనభోజనాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

రెడ్డి సంక్షేమ సేవా సంఘం మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో ముచ్చటగా మూడోసారి కార్తీకమాస వన భోజన మహోత్సవం వచ్చే డిసెంబర్ 3వ తేదీన మార్కాపురం సమీపంలోని శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కర్ణ వెంకట నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి వెంకటరామిరెడ్డి, కందుల బలరామిరెడ్డి, చిట్టిరెడ్డి నరసింహారెడ్డి, కందుల లక్ష్మీరెడ్డి, ఆర్‌వి సుబ్బారెడ్డి, దొండేటి వెంకటేశ్వరరెడ్డి, చదలవాడ రామిరెడ్డి, కాశిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న చెన్నకేశవుని పుష్కరిణి

తెప్పోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి తెప్పోత్సవం ప్రతి ఏడాది కార్తీక మాసంలో జరుగుతుంది. ఈ ఏడాది కూడా ఉభయదాత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. పుష్కరిణి (కోనేరు) శుభ్రం చేశారు. రంగులతో అందంగా తయారు చేశారు. మార్కాపురం చెరువులోని నీటిని తెప్పోత్సవానికి సరిపడే విధంగా నింపారు. ఈ తెప్పోత్సవం తిలకించేందుకు మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున జనం తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవంలో పోలీసులు నిర్వహించాల్సిన పాత్రపై మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవరెడ్డి ఈపాటికే సూచనలు, సలహాలు ఇచ్చారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జె వెంకట్రావు, షేక్ పాదుషాలను ఎన్నుకున్నారు. యూటిఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం రాత్రి పామూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా జె వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ పాదుషా, గౌరవ అధ్యక్షుడిగా గోదాసు వేమనారాయణ, సహాధ్యక్షుడిగా కే నాగరాజు, సహాధ్యక్షురాలుగా షేక్ రేష్మ, మహిళా కార్యదర్శిగా జె అనూష, కోశాధికారిగా కుండా వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్లుగా ఏ సురేష్, ఐ కొండయ్య, కార్యదర్శులుగా ఎన్ భాస్కరరావు, ఏ రాధ, ఎం నారాయణరెడ్డి, జి గోపీ నాగేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో జిల్లా కార్యదర్శి షేక్ రజియా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పామూరు

యుటిఎఫ్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రజాబేగం, పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ తిరుపతిరెడ్డి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా ముప్పాళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా డోలా ఉదయ్ కుమార్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎం రామారావు, సహాధ్యక్షులుగా నారాయణ, లక్ష్మి, కోశాధికారిగా శ్రీనివాసులు, మండల కార్యదర్శులుగా 9 మందిని ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా జివి పద్మావతి, పి తిరుపతిరెడ్డి, బి మాధవరావు, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, సురేష్‌బాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మం, మల్లికార్జున, కృష్ణారావు, వీరాంజనేయులు, ప్రసాద్ పాల్గొన్నారు.

పంట రక్షణకు హార్వెస్టర్ల వినియోగం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

ఓ ప్రక్క వాతావరణం మారింది. మరోపక్క పరిపక్వానికి చేరుకున్న పంటను చేతికి దక్కించుకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు. ఈ కోణంలో రైతులు హడావుడిగా హార్వెస్టర్లను వినియోగిస్తున్నారు. వేమూరు, కొల్లూరు, అమర్తలూరు మండలాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట కోతకు సిద్ధమయ్యింది. ప్రస్తుతం వరి ధాన్యం ధర రూ.1600వరకు పలుకుతుందని రైతులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం 75కేజీల బస్తా రూ.1800లకు కొనుగోలు చేయగా ఈ రెండు రోజులకే వ్యాపారులు రూ.200 ధర తగ్గించారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారడంతో దళారులు ధరను మరింత దిగజార్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికి అందితే ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని, దీనిపై చర్య లేవీ కనిపించడం

వర్షానికి తడిసిన వరిపైరును చక్కబెట్టుకుంటున్న రైతులు

లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా మే నెల వరకు రైతులు చేతుల నుండి ధాన్యం పూర్తిగా బయటకు వెళ్లేంతవరకు 75కేజీల బస్తా ధాన్యం ధర రూ.1500లకు మించలేదని, రైతుల నుండి ధాన్యం పూర్తిగా వ్యాపారస్తుల చేతులకి వెళ్ళిన తర్వాత అదే ధాన్యం 75కేజీలు రూ.2500వరకు వెళ్లినట్లు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్త ధాన్యం చేతికందే సమయానికి పాతధాన్యం కూడా 75కేజీల బస్తా రూ.2200కు తగ్గిందని, దానికి అనుగుణంగా కొత్త ధాన్యం ప్రస్తుతం రూ.1600కే కొనుగోలు చేయటం పట్ల పెరిగిన ఖర్చులతో తీవ్ర నష్టాలను చవిచి చూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయకపోవడంతో దళారులదే రాజ్యంగా కనిపిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.

వర్షాలకు నేల వాలుతున్న వరి పైరు

ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల్లో కురుస్తున్న చిరుజల్లులకు వరిపైరు నేలవాల్చింది. చేతికి అందిన పంటను దక్కించుకోవడానికి ఏర్పాటు చేసే హార్వెస్టర్లకు కూడా అధిక ధరలు వెచ్చించాల్సి ఉంటుంది. దానికి తోడు ధాన్యం ధర కూడా తగ్గుముఖం పట్టడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

పట్టెం దేవిడ్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

పాస్టర్ల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ ఓపెటి థియేటర్లో వైసిపి క్రిస్టియన్ మైనారిటీ బాపట్ల రీజనల్ చైర్మన్ పట్టెం డేవిడ్ మనోహర్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ పాస్టర్స్, బిషప్ కౌన్సిల్ కార్యవర్గ రీజనల్, చీరాల నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగా రాష్ట్ర అధ్యక్షులు మేడిత జాన్సన్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకొని, నియమక పత్రాలను అందజేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పాస్టర్లకు ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వడం చక్కటి పథకమని తెలిపారు. కార్యక్రమానికి శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, రూపసుమ దాసరి, అడపా నాగ మోహన్, రాజేష్, పరిశుద్ధ బాబు, వర్ల ఆదాం, పాల్ రమేష్, జోనాథన్ పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కర్లపాలెం

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపిక అవ్వటం సంతోషంగా ఉందని మండలంలోని చింతాయపాలెం పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట రాజు అన్నారు. పాఠశాల ప్రాంగణంలో గురువారం అభినందన సభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీలు ఈనెల21నుండి 23వరకు కర్నూలులో జరిగాయని తెలిపారు. రగ్బీ అండర్ -19 బాలుర విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఎం భర్గవ క్రిష్ణ అత్యంత ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రగ్బీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్లో 67వ రగ్బీ జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్రలోని పుణేలో జరుగుతాయని, ఆ పోటీల్లో తమ విద్యార్థి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పిడి ఎం గోపి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాడీ వైద్యుని గృహ ప్రవేశంలో ఎంఎల్‌ఎ కరణం బలరాం

గృహప్రవేశ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంగణంలో ప్రముఖ నాడి వైద్యులు డాక్టర్ జి శశిధర్ నూతన గృహప్రవేశ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ కరణం బలరామ కృష్ణ మూర్తి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచు గరటయ్య, రవి షాపింగ్ మాల్ అధినేత టిబివిన్ రవికుమార్, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు షేక్ హుమయూన్ కబీర్, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, కంపా అరుణ్, పొద ప్రసాద్, గోలి గిరి, పావులూరి కిరణ్ కుమార్, చందు, మాణిక్యరావు, సుధాకర్ మాస్టర్, రాజు, సాయి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మోర్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివరు గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో మారు జగన్మోహన్ రెడ్డి సిఎం కావాలని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కన్నులుగా ముందుకు సాగుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆదరించాలని కోరారు. తొలిత సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైసిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలా ఉషారాణి రమేష్, కో ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, ఇఒపిఆర్డి ఊహారాణి పాల్గొన్నారు.

పెద్దపులివర్రు వైసిపిలో విభేదాలు

పెద్దపల్లివర్రు గ్రామంలో గురువారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమంలో వైసిపి నాయకుల మధ్య విభేదాలు పొడ చూపాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి ఉదయ భాస్కరి ముందుండి నడిపిస్తున్నారు. కానీ ఎంపీపీ సొంత గ్రామమైన పెదపులివర్రులో జరిగిన కార్యక్రమంలో వాళ్లిద్దరూ కనిపించకపోవడం గ్రామంలో విమర్శకు కారణమైంది. ఈ గ్రామంలో సర్పంచ్, ఎంపీపీ మధ్య విభేదాలు ఉన్నట్లు పలువురు వైసిపి నాయకులు వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది విభేదాలు ఇదే రీతిలో కొనసాగితే వైసిపి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని వైసిపి నాయకులే అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.

పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి

చీరాల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసిపి పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి అన్నారు. ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు 4వ వార్డు కౌన్సిలర్ గోలి జగదీష్ అధ్యక్షతన క్లస్టర్-1 జక్కావారివీధి సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేయాలని అన్నారు. కరణం వెంకటేష్‌ను గెలిపించుకోవాలని అన్నారు. అదే విధంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వైసిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, జేసీఎస్ పట్టణ ఇంచార్జి కోలా శివకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, గోలి రవి, అక్కల శంకర్, అవ్వారు బాలాజీ, భువనగిరి అనురాధ, యాసం రామారావు పాల్గొన్నారు.

విజయనగరకాలనీలో వైసిపి జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

చీరాల : మండలం తోటవారిపాలెం, విజయనగరకాలనీ, బుర్లవారిపాలెం సచివాలయాల పరిధిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం జోరు వానలో సైతం నిర్వహించారు. ఇంటింటికీ వైసిపి కార్యకర్తలు, నాయకులు వెళ్లారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా అమలైన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా వైసిపి చీరాల రూరల్ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి లబ్దిదారులతో మాట్లాడారు. మరోసారి జగనన్నను గెలిపించుకోవాల్సిన ఆవస్యకతను వివరించి చెప్పారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రతి ఇంటికీ అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల ఇంచార్జీ బుర్ల సాంబశివరావు, మండల మాజీ ఉపాధ్యక్షులు నాదెండ్ల కోటేశ్వరరావు, బుర్ల మురళికృష్ణ, పర్చూనేని శ్రీనివాసరావు, వృధ్వీ ధనుంజయ, తేళ్ల రాంబాబు, పిట్టు పోలయ్య, చప్పిడి రామచంద్ర, అంధె సుబ్బారాయుడు, మంచికలపాటి శ్రీనివాసరావు, సిహెచ్ రమణయ్య, సలగల మాణిక్యరావు, చిన్నం చిట్టి బాబు, సలగల యోహెూవ, సలగల గాలెబు, సలగల రాజేష్, నాదెండ్ల రమేష్, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

అక్కాయపాలెంలో వైసిపి జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

వేటపాలెం : మండలంలోని అక్కాయిపాలెం సచివాలయం పరిధిలో ఏపికి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి వేటపాలెం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జెసిఎస్ మండల ఇన్చార్జ్ లేళ్ల శ్రీధర్, సీతామహాలక్ష్మి, మాజీ సర్పంచ్ చుండూరు వాసు, కట్టా గంగయ్య, జంగిలి రామారావు, బాబీ, పిన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచి సాంబిరెడ్డి, ఖాదర్, దంత హనుమంతు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

'ఆడుదాం ఆంధ్ర'పై శిక్షణ

ప్రజాశక్తి - నగరం

స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. డిసెంబర్ 15నుండి జనవరి 26వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంపై గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ మహిళా పోలీసులు, హెచ్‌ఎంలకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం ప్రమీల, ఎంపీడీఒ చక్రపాణి ప్రసాద్, ఎంఈఓ కొలసాని హరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నాగలక్ష్మి

చెరుకుపల్లి : క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం అయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపిడిఓ నాగలక్ష్మి సూచించారు. డిసెంబర్ 15నుండి జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అమలుపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో తహసిల్దార్ బి వెంకటేశ్వర్లు, ఎంఈఓ టి నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు జల్లులతో ఆహ్లాదంగా వాతావరణం

యర్రగొండపాలెంలో చిరు జల్లులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో గురువారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ చిరుజల్లులు పడ్డాయి. చిరు జల్లుల వల్ల పంటలకు ఒరిగేదేమీ లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పూత, పిందెలు వస్తున్న మిర్చి, కంది తోటలకు తెగుళ్లతో పాటు పురుగుల ఉధృతి అధిక మవుతోందని రైతులు వాపోతున్నారు.

భూ ఆక్రమణపై విచారణ

కబ్జాదారుల్ని అరెస్టు చేయాలని నీలం నాగేంద్రం డిమాండ్

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక పోలీసు స్టేషన్లో నమోదైన దళితుల భూ ఆక్రమణ కేసులో బాపట్ల ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ డిఎస్పి ఎవి రమణ గురువారం దళిత నాయకులు సమక్షంలో విచారణ జరిపారు. తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన ఆబోతు విమలమ్మకు చెందిన ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. అద్దంకి మండలం మోదేపల్లి సర్వేనెంబర్ 372/10లో 19సెంట్ల భూమిని 2017లో రూ.లక్ష యాభై వేలకు ఆబోతు విమలమ్మ కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. కానీ రోడ్డు పక్కనే ఉన్న ఈ పొలంపై కన్నేసిన పక్క పొలానికి చెందిన ఆలోకం హరి బాబు, చిన్నమ్మాయి దళితుల భూమిని ఆక్రమించేందుకు కుట్ర చేశారు. ఈ భూమిలో పశువుల మేతపైరు దళితులు వేసుకోగా గత నెల రోజుల క్రితం దున్ని పంటను ధ్వంసం చేశారు. అప్పటి నుండి తాళ్లూరు పోలీసు స్టేషన్‌కు, అద్దంకి పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసిన దళితులకు న్యాయం జరగలేదు. తమకు న్యాయం చేయాలని బాధితురాలు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అద్దంకి తహశీల్దారుకు కలెక్టరేట్ అధికారులు ఫిర్యాదును పంపి చేతులు దులుసుకున్నారు. ఆ ఫిర్యాదుపై అద్దంకి తహశీల్దారు కార్యాలయం అధికారులు స్పందించలేదని బాధితురాలు ఆరోపించారు. తాను స్పందనలో పిర్యాదు చేసిన విషయం తెలిసిన భూ ఆక్రమణ దారుడు ఆలోకం హరిబాబు దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ద్వారా దర్శి డిఎస్పికి ఫోనులో చెప్పించుకుని కేసు నమోదు కాకుండా చేశారని పేర్కొన్నారు. అద్దంకి వైసిపి ఇన్చార్జి కృష్ణ చైతన్య ద్వారా అద్దంకి పోలీసు స్టేషన్లో కూడా కేసు నమోదు కాకుండా చేస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి తహశీల్దారు రిపోర్టు రావాలి, ఇది సివిల్ మ్యాటర్ అంటూ రెండు వారాలు కాలయాపన చేశారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న దళిత నేత నీలం నాగేంద్రం చీరాల డిఎస్పి ప్రసాదరావుతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ యాక్టు ద్వారా కేసు నమోదు చేయాలని అద్దంకి సీఐ రమేష్ బాబును కోరారు. బాధితురాలు ఆబోతు విమలమ్మకు చెందిన భూమి ఆక్రమణపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈనెల 19న క్రైమ్ నెంబర్ 330/23 ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదు కావడంతో జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ బాపట్ల ఎస్సీ, ఎస్టీ డిఎస్పి ఎవి రమణను విచారణ అధికారిగా నియమించారు. విచారణ నిమిత్తం వచ్చిన బాపట్ల డిఎస్పి ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించడమే కాకుండా నిందితులను కూడా పిలిపించి విచారించారు. సాక్షులను కూడా స్థానిక పోలీస్ స్టేషన్లో దళిత నాయకులు నీలం నాగేంద్రం, దారా అంజయ్య సమక్షంలో విచారించారు. ఈ కేసు విచారణలో డిఎస్పి వెంట అద్దంకి రూరల్ ఎస్ఐ కె వెంకటేశ్వర్లు ఉన్నారు. దళితుల భూములు ఆక్రమిస్తే జైలుకు పంపిస్తామని కేసులో నిందితులను హెచ్చరించారు.

దళితుల భూమి ఆక్రమణపై విచారణ చేస్తున్న డిఎస్‌పి

టిడిపి నాయకులు జార్జిని పరామర్శిస్తున్న ఆనందబాబు

జార్జికి ఆనందబాబు పరామర్శ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని చింతమోటు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఎలవర్తి జార్జి అనారోగ్యంతో గుంటూరులో వైద్య చికిత్స పొందుతుండగా ఆయనను మాజీ మంత్రి నక్కా ఆనందబాబు గురువారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. టిడిపిలో క్రియాశీలక వ్యక్తిగా ఉన్న జార్జి ఆయురారోగ్యాలతో తిరిగి రావాలని కోరారు. అతనికి టిడిపి అండగా ఉంటుందని భరోసాని ఇచ్చారు.

పాతబస్టాండులో వర్షంలో ఇబ్బంది పడుతున్న జనం

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల జిల్లా కేంద్రం కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లు బస్టాండులో ఏర్పాట్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత బస్టాండ్ సెంటర్లో కొద్దిపాటి వర్షానికే నీళ్లు నిలిచిపోతున్నాయి. చుట్టూ రోడ్లు మెరకలేపిన అధికారులు బస్టాండును మాత్రం పల్లం చేశారు. వర్షానికి వచ్చే నీళ్లు వెళ్లేందుకు కాలువకూడా లేకపోవడంతో మోకాలిలోతు నిలిచిపోతున్నాయి. వర్షానికి షెల్టర్‌లోకి వెళ్లిన ప్రయాణికులు కూర్చునేందుకు కనీస సౌకర్యం లేదు. ఒకవేళ నిల్చుని ఉన్న ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే నీటిలో తడుచుకుంటూ వెళ్లాల్సిందే. అధికారుల అనాలోచి నిర్ణయం, ప్రణాళిక లేకుండా రోడ్ల నిర్మాణం కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఆర్టీసీ స్థలంలో వైసిపి కార్యాలయం నిర్మాణానికి కేటాయించిన ఆర్టీసీ అధికారులు విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు బస్టాండు చుట్టూ రోడ్లు మెరకలేపి బస్టాండును పల్లం చేయడంతో ప్రయాణికులనుండీ విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాత బస్టాండులో నీళ్లు నిలవకుండా చేయాలని కోరుతున్నారు.

టిడిపి, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నినాదంతో టిడిపి నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కంభం సుధీర్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు అవసరం అనే ప్రజలంతా గుర్తించి మరో మారు టిడిపిని గెలిపించాలని కోరారు. బాబు షఉరిటీ పత్రాలపై రిజిస్ట్రేషన్ చేయించారు. ఐలవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల జయశీలరావు, సిరాజుద్దీన్, లంకా ప్రసాద్, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, దీపాల ప్రసాద్ పాల్గొన్నారు.

కర్లపాలెం : టిడిపి, జనసేనతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని జనసేన కోఆర్డినేటర్ నామన వెంకట శివ నారాయణ అన్నారు. టిడిపి, జనసేన అధినేతల ఉమ్మడి ఆదేశాల మేరకు బాబు షఉరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం గణపవరం గ్రామంలో నిర్వహించారు. ఉమ్మడి విధానాలు ప్రజలకు వివరిస్తూ భవిష్యత్తుకు గ్యారంటీ పత్రాలలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. ఉమ్మడి మినీ మేనిఫెస్టో పథకాలు గురించి వివరించారు. వైసిపి అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల ఆవేదన చెబుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నక్కల వెంకట స్వామి, ఏపూరి భూపతిరావు, గొట్టిపాటి శ్రీకృష్ణ, ఇమాడబత్తని వెంకయ్య నాయుడు, నక్కల అయిప్ప, ఇనగంటి సునీత పాల్గొన్నారు.

టిడిపి మినీ మేనిఫెస్టో పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి చెన్ను కోటేశ్వరరావు

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని మాజీ ఎంపీపీ చేన్ను కోటేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా కంటి వెలుగు పథకం ద్వారా మండలంలోని గుండ్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళ్ళజోళ్లు గురువారం పంపిణీ చేశారు. 53మంది విద్యార్థులకు కళ్ళజోళ్లు అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్ బాబు మాట్లాడుతూ అవసరమైన ప్రతి విద్యార్థికి పరీక్షలు నిర్వహించి అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రత్యేక ఘనతను సాధించిందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కవిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సోహెల్ అహ్మద్, ఎఎన్ఎం సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలింతలకు రొట్టెలు పంపిణీ చేస్తున్న శ్యామలరెడ్డి

పేద విద్యార్థులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - బాపట్ల

నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించి రానున్న రోజుల్లో వారి ఉన్నత విద్యకు సహకరిస్తామని బాపట్ల జై ఆంధ్ర సంఘం అధ్యక్షురాలు పగడం శ్యామలరెడ్డి అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాలలో బాలింతలకు పండ్లు, రొట్టెలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేదలు తమ పిల్లలను పాఠశాలకు పంపలేని పరిస్థితుల్లో పొలం గట్లపై, కాలువ కట్టలపై జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటివారికి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. తమ సంఘం ద్వారా ఎస్టీ యానాదుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతోపాటు వారికి అవసరమైన దుస్తులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి సాయి కృష్ణ, కార్యదర్శి బి సుకన్య, కార్యవర్గ సభ్యులు ఎస్ లక్ష్మి, యేసు మణెమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి బి నరేష్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న విఎఎ జి పృధ్వీసాయి

రైతుల సమస్యలు చెప్పండి

ప్రజాశక్తి - పంగులూరు

రైతులకు పంటల సాగులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని మండలంలోని బయట మంజులూరు రైతు భరోసా కేంద్రం విఏఏ గురజాల పృధ్వీ సాయి కోరారు. స్థానిక సచివాలయంలో రైతులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బికె పరిధిలో బయట మంజులూరు, భగవాన్ రాజు పాలెం గ్రామాలు ఉన్నాయని అన్నారు. బయట మంజులూరు గ్రామంలో ఖరీఫ్‌లో 114మంది రైతులు 365ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని అన్నారు. ఇందులో వరి 45ఎకరాలు, మినుము 184ఎకరాలు, మిరప 12ఎకరాలు, సుబాబుల్ 124 ఎకరాల్లో సాగు చేశారని చెప్పారు. రభీ ఈ క్రాప్ ఇంకా మొదలు కాలేదని తెలిపారు. ఈ క్రాప్ మొదలైన వెంటనే రైతులకు తెలియజేస్తామని చెప్పారు. అప్పుడు రైతులంతా ఈ క్రాప్ చేయించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆర్‌బికె ద్వారా 40శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు ఇస్తున్నామని తెలిపారు. శనగ పంట సాగు చేసే రైతాంగం విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్ నార్ని అనిల్, రైతు చక్రవరం శ్రీరంగరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చంద్రకిరణ్‌రెడ్డి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్లపాలెం

మానవసేవయే మాధవ సేవగా భావించి అభాగ్యులైన నిరుపేదలకు సేవ చేయటం సంతృప్తినిస్తుందని యునోయా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టి దొంతిరెడ్డి చంద్రకిరణ్ రెడ్డి అన్నారు. యునోయా ట్రస్ట్ ఆవిష్కరణ సందర్భంగా శ్రీరామ నగర్ గ్రామంలో వృద్ధులు, వితంతు మహిళలు 50మందికి దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. తమ తాత నాగిరెడ్డి, నాయనమ్మ బిక్షావతి జ్ఞాపకార్థం తమ తండ్రి శ్రీనివాసరెడ్డి, తల్లి మృదులతో కలిసి చలి కాలంలో ఉపయోగపడే విధంగా దుప్పట్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోడ లాభంరాజు, ఆట్ల వెంకట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రసాదం పంపిణీ చేస్తున్న భక్తులు, దాతలు

కణికేశ్వరంలో కార్తీకమాస శోభ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మాణి కేశ్వరం గ్రామంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. గుండ్లకమ్మ నదిలో పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. ట్రస్టు బోర్డు విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా మౌలిక వసతులను కల్పించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాలను తన సహాయ సహకారాలతో అందిస్తున్నారు. కొరిసపాడు మండలం మేదరమెట్లకు చెందిన నిడమానూరి నాగేశ్వరరావు, హనుమంతురావు భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈదా శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణం పూర్తి చేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ భవనాల నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా పంచాయతీరాజ్ ఇఇలు, డిఇలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ క్లినిక్స్‌ను నిర్దేశించిన గడువులోగా కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ. కొండయ్య, ఇఇలు, డిఇలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా : ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. స్థానిక స్పందన హాలులో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, ఎంపిడిఒలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల లక్ష్యాలను నిర్ణయించి పూర్తి చేయడంలో ఇంజినీర్లు వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల అంచనాల కంటే అదనపు అంచనాలతో రికార్డు చేపిన పర్చూరు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ జోషిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో పంచాయతీ రాజ్ ఎస్ఇ హరి నారాయణ, డిపిఒ దాసరి రాంబాబు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ రావు,ప్రకాశం జిల్లా జడ్‌పి సిఇఒ జాలి రెడ్డి, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆపండి

సిఐటియు రాష్ట్ర నాయకుడు ఎం.అయ్యప్ప రెడ్డి

రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, ఆ శాఖలోని ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.అయ్యప్ప రెడ్డి డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సిఐటియు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు రైల్వేస్టేషన్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైల్వే ప్రైవేటీకరణ ఆపాలన్నారు. నేడు ఏ రైలు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. కార్పొరేటీ కన్నా ప్రైవేట్ వ్యవస్థ ప్రజలను కొల్లగొట్టుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ ప్రజల ఆస్తులు, రైల్వే, ఎల్ఐసి, విమానాశ్రయాలు లాంటి పెద్దపెద్ద సంస్థలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తు న్నారన్నారు. రైల్వేను ప్రైవేటీకరణ చేయటం సామాన్య ప్రజలకు ప్రయాణానికి దూరం చేయడమేనని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్యాసింజర్లను పున రుద్ధరించాలలన్నారు. ప్రజా రవాణా సౌకర్యాన్ని అభివద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బివి.రావు, నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, తంగిరాల మహేష్ ,నగర నాయకులు తంబి శ్రీనివాసులు ,ఎస్‌డి.హుస్సేన్ పాల్గొన్నారు

కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాజానికి ఉపయోగపడేలా కొత్త ఆవిష్కరణలపై విద్యార్థులు మరింతగా దష్టి సారించాలని కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక క్విస్ కాలేజీలోని ఐడియా ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన టెక్ ఎక్స్‌పోను గురువారం సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను పరిశీలించి వాటి ఉపయోగాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగేలా, సమాజ ఉపయోగానికి దోహదపడేలా వినూత్న ఆవిష్కరణలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా మరింత అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు, ఆదిశగా కృషి చేయాలన్నాడు. అత్యాధునికమైన డిజిటల్ లైట్ సింథసిస్ ఆధారిత 3- డి ప్రింటింగ్ ద్వారా వివిధ ఉత్పత్తుల రూపకల్పన, క్యాలిబ్రి మినీ 3-డి స్కానర్, పిసిబి మెషిన్, సిఒ-2 లేజర్ కటింగ్ మిషన్, సి.ఎన్.పి. ఉడ్ రూటర్ మిషన్ల ద్వారా తమ విద్యార్థులు చేసిన కొత్త ఆవిష్కరణల ను కళాశాల యాజమాన్యం ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించింది. ఈ కార్యక్రమంలో క్విస్ కళాశాల చైర్మన్ సూర్య కళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపల్ హనుమంతరావు, డైరెక్టర్ సుబ్బారావు, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి. శ్రీనివాసరావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు,, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో మహిళా జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి చెరుకూరి పుల్లయ్య సమక్షంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 50 మంది క్రీడాకారిణులు పాల్గొనన్నున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిభ ఆధారంగా 15 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులకు ఈ నెల 24 నుంచి 28 వరకూ పాకలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చేనెల 1 వరకూ కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహిస్తున్న 70వ ఆంధ్ర రాష్ట్ర అంతర జిల్లాల మహిళల కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు పి హజరత్తయ్య, లలిత పర్యవేక్షించారు.

జిల్లా మహిళల జట్టు ఇదే...

జె కోమలి(ఇంకొల్లు), కె భూమిక, వి అర్చన, కె నందిని, వి అపర్ణ, కె విజయలక్ష్మి(పాకల), సిహెచ్ బంగారమ్మ (కొత్తపట్నం) వివి సింధూరి (పిసిపల్లి), జి రమ్య, ఎన్ ముని శారద, ఎల్ చందు ప్రియ (ఒంగోలు), ఆర్ వెంకట్ దీపిక, డి యామిని(అడివీధిపాలెం),బ్లెస్సీ అమూల్య, మేరీ స్వీటీ (పాకల) ఎంపికయ్యారు.

పేదలకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

ఒంగోలులో చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

బాపట్లలో చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేద కుటుంబాలలోని ఆడపిల్లల పెళ్లి ఖర్చు తల్లిదండ్రులకు భారం కాకుండా గౌరవంగా వివాహం జరిపించేలా ఆర్థిక సహాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 'వైఎస్ఆర్ కల్యాణమసు - వైఎస్ఆర్ షాదీ తోఫా' పథకం భాగంగా నాలుగో విడత లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందజేసే కార్యమపై తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందించి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ పేద కుటుంబాలలో బాల్య వివాహాలను నివారించడంతోపాటు ఆడపిల్ల పెళ్లి ఖర్చు తల్లిదండ్రులకు భారం కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. నాలుగో విడతలో జిల్లాలో 593 మందికి (వీరిలో 23 మంది కులాంతర వివాహాలు చేసుకున్నారు) రూ.4,91,65,000 లబ్ధి కలిగిందన్నారు. ఈ నాలుగు విడతలలో కలిపి 1572 మందికి రూ.12,93,30,000 ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ మెప్మా పీడీ టి.రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, జిల్లాబీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి సురేష్ కన్నా, సచివాలయాల నోడల్ ఆఫీసర్ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం లబ్ధిదారులకు కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో గురువారం నగదు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో బట్టన్ నొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కు రూపంలో నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలో అక్షరాస్యతను మరింత పెంచడానికి కళ్యాణమస్తు పథకాన్ని ప్రభుత్వం స్వల్ప మార్పు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో గడచిన త్రైమాసంలో వివాహాలు చేసుకున్న నవ దంపతులకు ప్రభుత్వం నగదు పంపిణీ చేసిందన్నారు. 219 ఎస్‌సి జంటలు, 17 ఎస్‌టి జంటలు, 41 బీసీ -ఏ జంటలు, 50 బిసి -బి జంటలు, 29 బిసి-డి జంటలు, 25 బిసి-ఇ జంటలు, 8 ఒసి జంటలు, రెండు వికలాంగ జంటలు, ఒక భవన నిర్మాణ రంగ కార్మికుల జంటకు కలిపి మొత్తం 392 జంటలకు రూ.3.38 కోట్లు లబ్ధిదారుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. నవ దంపతులు తమ కుటుంబ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ అర్జున్ రావు, ఎస్‌సి సంక్షేమ సాధికారత అధికారి జె. రాజదిబోరా, కలెక్టరేట్ ఎఒ గోపికష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలుకలెక్టరేట్

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్‌పి మలికా గర్గ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో నెలవారీ నేరసమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి గ్రేవ్, ఎలక్షన్ కేసులు, పలు షీట్స్, పీడీ యాక్టు, ల్యాండ్ కేసులు, గుడ్ ట్రయల్ మానిటరింగ్ కేసులు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులలో అధికారులు పకడ్బందీగా, పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిం చాలన్నారు. ప్రతి కేసుకు సంబంధించి ప్రణాళిక ఉండాలని, మర్డర్, మహిళలపై జరిగే నేరాలు, దొంగతనం, ఎన్‌డిపిఎస్, పోక్సో/రేప్, ఇతర గ్రేవ్ కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణను త్వరగా పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవటానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. గతంలో ఎన్నికలకు సంబంధించిన కేసులపై సమీక్షించి, రానున్న ఎన్నికలను దష్టి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌పి పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో ఎఎస్‌పి (క్రైం) ఎస్‌పి శ్రీధర్ రావు, ఎఆర్ ఎస్‌పి అశోక్ బాబు, ఎస్‌బి డిఎస్‌పి బి.మరియాదాసు, డిఎస్‌పిలు నారాయణ స్వామి రెడ్డి, రామరాజు, అశోక్ వర్ధన్, వీర రాఘవరెడ్డి, వి. శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ట్రైనీ డిఎస్‌పి షేక్ షహబాజ్, డిసిఆర్‌బి సిఐ ధర్మేంద్రబాబు, సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.